సాక్షి రాజన్న సిరిసిల్ల

గురువారం । 16 । మే । 2024

వరాలతల్లికి బోనం మొక్కు



కోనరావుపేట(వేములవాడ): మామిడిపల్లిలో వరాల పోచమ్మకు బోనాలు తీశారు. గ్రామంలోని అన్ని కులసంఘాల ఆధ్వర్యంలో వరాల పోచమ్మ బోనాల ఉత్సవాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రైతులకు ఇబ్బందులు కలగొద్దు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రుద్రంగి(వేములవాడ): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. రుద్రంగిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించి, రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా చూడాలని లారీ, వ్యాన్ అసోషియేషన్ ఓనర్లకు సూచించారు. రైతుల సమస్యపై పౌర సరఫరాల కమిషనర్ చౌహాన్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలెక్టర్‌లు యాస్మిన్ బాషా, అనురాగ్ జయంతి, డీసీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం జితేందర్ ప్రసాద్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా పారబాయిల్డ్ రైస్‌మిల్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగరాజుతో మాట్లాడి మిల్లులకు వచ్చిన ధాన్యం బస్తాలను త్వరగా దించుకోవాలని సూచించారు. రుద్రంగి మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం, నాయకులు గండి నారాయణ, దాసరి గంగరాజం ఉన్నారు.

మల్కాపేటలో రోడ్డెక్కిన రైతులు

- ధాన్యం కొనడం లేదని ఆరోపణ



ధర్నా చేస్తున్న రైతులు

కోనరావుపేట(వేములవాడ): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ రైతులు రోడ్డెక్కారు. కోనరావుపేట మండలం మల్కాపేటలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు బుధవారం రోడ్డుపై బైఠాయించారు. ఒకవైపు అకాల వర్షాలకు వడ్లు తడిసి ముద్దవుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగడం లేదని, వర్షాకాలం సమీపిస్తున్నందునా వెంటనే అధికారులు స్పందించాలని కోరారు. ఈవిషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

108 వాహనంలో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం



చందుర్తి(వేములవాడ): పురిటి నొప్పులతో బాధపడుతున్న చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన గర్భిణీ గంట స్వప్నను 108 వాహనంలో బుధవారం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నప్పటికీ చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, వైద్యసేవలు అందించారు. సకాలంలో స్పందించిన అంబులెన్స్ పైలట్ బాబు, ఈఎంటీ విక్రమ్‌లను వైద్యాధికారులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, లెక్చరర్లు

వేములవాడఅర్బన్: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. వేములవాడ మండల అగ్రహారం ప్రభుత్వ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌లకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులతో కలిసి బుధవారం ఎస్పీ ఆవిష్కరించారు.

ఎములాడలో ట్రాఫికర్

- మెయిన్‌రోడ్డుకు మోక్షమెప్పుడో?
- మార్కింగ్ చేయడం.. వదిలేయడం
- అవస్థలు పడుతున్న స్థానికులు, భక్తులు

వేములవాడ ప్రొఫైల్

బ్రిడ్జి నుంచి గుడి వరకు మెయిన్ రోడ్డు
800 మీటర్లు

గుడి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు మెయిన్ రోడ్డు
800 మీటర్లు

రోడ్డు విస్తరణ చేపట్టాల్సిన పొడవు
1,600 మీటర్లు

రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులు
439 మంది

చేపట్టాల్సిన రోడ్ల విస్తరణ
80 ఫీట్లు

పట్టణ జనాభా : 50 వేలు

నిత్యం వచ్చే భక్తులు
30వేల నుంచి 40 వేలు

ప్రస్తుతం ఉన్న మెయిన్ రోడ్డు
20 నుంచి 25 ఫీట్లు



వేములవాడ రాజన్న గుడి ఎదుట ప్రధాన రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రం, దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోతున్నాయి. రోడ్ల విస్తరణ చేపట్టకపోవడం, భక్తుల రాక పెరిగిపోవడంతో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇరుకైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు గడుస్తున్నా వేములవాడలో రోడ్ల విస్తరణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు. అధికారులు ఇప్పటికే పలుమార్లు సర్వే చేసి, మార్కింగ్ చేశారు. అయితే విస్తరణ పనులు మాత్రం చేపట్టడం లేదు.

కొలతలు తీయడం.. ప్రకటనలు చేయడం

వేములవాడ ప్రధానరోడ్డు విస్తరించాల్సిన అవసరం ఉంది. బ్రిడ్జి నుంచి రాజన్నగుడి, రాజన్న గుడి నుంచి భీమేశ్వరాలయం మీదుగా బద్దిపోచమ్మ గుడి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ఉన్న రోడ్డును 80 ఫీట్లతో విస్తరించేందుకు అధికారులు మార్కింగ్ చేశారు. పనులు చేపట్టేందుకు వీటీడీఏ నుంచి నిధులు సైతం సమకూర్చినట్లు తెలిసింది. కానీ సమస్య పరిష్కారం కాలేదు.

తరచూ ట్రాఫిక్ జామ్

రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వ్యక్తిగత వాహనాల్లో వస్తుండడంతో తిప్పాపూర్ నుంచే ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఆది, సోమవారాల్లో ఈ సమస్య మరింత జఠిలమవుతుంది.

ట్రాఫిక్‌తో కష్టంగా ఉంటుంది



వేములవాడలో వ్యక్తిగత పనులపై బయటకు వస్తే ఎక్కడ ట్రాఫిక్ జామ్ అవుతుందనే భయం వెంటాడుతుంది. రాజన్న గుడి ముందు నుంచి ఎటు వైపు వెళ్లాలన్నా ఇబ్బందే. ఇప్పటికే అధికారులు పలుమార్లు మార్కింగ్ చేశారే తప్ప పనులు మాత్రం చేయలేదు.

– వంగళ కర్ణ, అడ్వకేట్

ప్రభుత్వ ఆదేశాలతో ముందుకెళ్తాం



వేములవాడ మెయిన్‌రోడ్డు విస్తరణకు కొలతలు తీసుకున్నాం. వీటీడీఏ ఆధ్వర్యంలో నియమించిన స్పెషలాఫీసర్ సమక్షంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు గతంలోనే సర్వే చేసి, కొలతలు తీశారు. బ్రిడ్జి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 80 ఫీట్లతో రోడ్ల విస్తరణకు నివేదికలను ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వం ఆదేశిస్తే పనులు ప్రారంభిస్తాం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

మహిళలు ఉపాధిని విస్తరించాలి

- నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలి
- స్వయం సంఘాల మహిళలతో కలెక్టర్ అనురాగ్ జయంతి



కలెక్టరేట్‌లో మహిళా సంఘాలతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: మహిళలు ఉపాధి సాధిస్తూ.. పది మందికి విస్తరిస్తూ.. ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో బుధవారం స్వయం సంఘాల గ్రూపులకు చెందిన మహిళలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నూతన ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను ఉత్పత్తి.. సరఫరా చేస్తూ.. నమ్మకమైన ఉపాధికి బాటలు వేసుకోవాలని సూచించారు. మహిళలు ఆర్థిక స్వావలంభన సాధిస్తే.. సామాజికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తారన్నారు. జిల్లాలోని మహిళలు యంత్రాలపై విస్తారాకులు, పేపర్ ప్లేట్స్, చట్నీలు, వక్కపొడి, లెదర్ బ్యాగ్స్, స్వీట్స్, సమోసాలు, పిండి వంటలు, మగ్గం వర్క్స్ ఇతర సామగ్రి తయారు చేసి విక్రయిస్తున్న అంశాలను చర్చించారు. వస్తువుల తయారీ, దానికి అయ్యే ఖర్చు, ఎంత మందికి ఉపాధి అవకాశాలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేశ్, మెప్మా డీఎంసీ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



గుడిచెరువు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ గౌతమి

వేములవాడ: రాజన్న గుడి చెరువు బండ్ పనులు, మండల పరిషత్ ఆవరణలోని పార్క్ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ గౌతమితో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఈ నర్సింహస్వామి ఉన్నారు.

'ఉపాధి'లో అతివలు !

- కూలీల్లో సగానికిపైగా మహిళలే..
- మొత్తం జాబ్‌కార్డులు 97,609
- సభ్యత్వం ఉన్న కూలీలు 1,99,449
- మహిళా కూలీలు 1,00,727 మంది

రుద్రంగి(వేములవాడ): పల్లెల్లో వలసల నివారణకు ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం పనులకు మహిళలు అత్యధికంగా హాజరవుతున్నారు. ఇటీవల వ్యవసాయ పనులు లేకపోవడం.. గ్రామాల్లో ఇతర ఉపాధి అవకాశాలు లేక చాలా మంది స్త్రీలు ఉపాధిహామీ పనులకు వస్తున్నారు. వేసవి భత్యం కూడా పెంచడం కూడా కూలీల సంఖ్య పెరగడానికి కారణం.

ఏడాదంతా పని

ఉపాధిహామీ పథకంలో మహిళలు సత్తా చాటుతున్నారు. ఒక్కో కూలీకి ఏడాదికి 100 రోజులు పని కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో హరితహారం నర్సరీల నిర్వహణ, మొక్కల సంరక్షణ వంటి పనులు చేస్తున్నారు. వీటితో ఉపాధిహామీ కూలీలకు ఏడాదంతా పనులు ఉంటున్నాయి. వానాకాలంలో హరితహారం మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం ఇలా ప్రతి పథకంలోనూ ఉపాధి కూలీలను వినియోగిస్తున్నారు.

కుటుంబాలకు 'ఆమె' అండ

ఉదయం పార, పలుగు పట్టుకొని పురుషులతో పాటు మహిళలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. మధ్యాహ్నం ఇంటికొచ్చి కుటుంబ పనులు చూసుకుంటున్నారు. మరికొందరు మహిళలు ఉదయం ఈజీఎస్ పనులకు వెళ్లి త్వరగా ముగించుకొని తర్వాత తమ సొంత వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో మేట్లు కీలకపాత్ర పోషిస్తుంటారు. ఎంబీ రికార్డు నమోదులో కూలీల హాజరు తదితర పనుల్లో వీరిది ప్రధాన పాత్ర. అయితే ఇప్పటి వరకు సదరు పనుల్లో పురుషులను వినియోగించుకోగా ప్రస్తుతం మహిళా కూలీల సేవలను సైతం వినియోగించుకుంటున్నారు. గతంలో కూలీల్లో ఒకరు సీనియర్ మేట్ బాధ్యత చూసేవారు. ప్రస్తుతం హాబిటేషన్‌కు ఒకరిని నియమించారు. ఎక్కడైనా మహిళలు అందుబాటులో లేనప్పుడే పురుషులకు అవకాశం కల్పించారు.



ఉపాధిహామీ పనులు చేస్తున్న మహిళలు(ఫైల్)



దుర్వేషావలి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఘనంగా ఉర్సు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులోని దర్గావలిగుట్టపై దుర్వేషావలి దర్గా వద్ద బుధవారం ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట నుంచి సందల్(గంధం)ను ఊరేగింపుగా దర్గావలిగుట్ట వరకు తీసుకెళ్లారు. దారి పొడవునా ఆశ్వాలతో ప్రత్యేక నృత్యాలు, డప్పు వాయిద్యాలు, మత గురువుల ప్రార్థనలతో ఊరేగింపు సాగింది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నిర్వాహకులు షేక్ అజీజ్, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కనిమేని చక్రధర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి తదితరులు హాజరయ్యారు. రాత్రి 8 గంటల నుంచి మొదలైన కవ్వాలి బృందం ప్రదర్శనలు అలరించాయి.



ఎల్లారెడ్డిపేటలో సందల్ ఊరేగింపు

బీసీ స్టడీ సర్కిల్ పరీక్షల తేదీలు ఖరారు

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ స్టడీసర్కిళ్లలో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలకు సంబంధించిన ఆన్‌లైన్ గ్రాండ్ టెస్టుల తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 18, 20, 22, 25, 27, 29, 31వ తేదీలతోపాటు జూన్ 1, 3న కూడా ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి తెలిపారు. www.tsbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మాత్రమే పరీక్షలు నిర్వహిస్తామని, మిగిలిన వివరాల కోసం 93818 88749లో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, దివ్యాంగ, మైనార్టీ విభాగాలకు చెందిన ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు రెప్యూటెడ్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. పదోతరగతిలో 7, ఆపై జీపీఏ సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 30 వరకు దరఖాస్తులను అధికారిక వెబ్‌సైట్ http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో తమ వివరాలు పొందుపరచాలని సూచించారు.

కోడ్.. పరేషాన్

- ఎన్నికల వేళ కేసులపాలు
- అవగాహన లేక కష్టాలు
- అధిక మొత్తంలో నగదు తరలిస్తూ పట్టుబడ్డ పలువురు
- ఇంకా కొనసాగుతున్న ఎన్నికల కోడ్

జిల్లాలోని ఓ మండల స్థాయి అధికారి విధి నిర్వహణలో సత్ఫలితాలు సాధించారు. ఆయన ప్రతిభను గౌరవించాలన్న ఉద్దేశ్యంతో ఆ మండలంలోని ప్రజాప్రతినిధులు, కిందిస్థాయి సిబ్బంది సదరు అధికారిని సన్మానించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న వేళ అధికారి రాజకీయ నాయకులతో సన్మానం పొందడంపై ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించిన అధికారులు మోడల్ కోడ్ కండక్ట్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకున్నారు.

వేములవాడకు చెందిన చెందిన ఓ వ్యాపారి తన గుమస్తాతో గత నెలలో బ్యాంకులో జమ చేసేందుకు రూ.5.67 లక్షలు పంపించాడు. ఎప్పటిలాగే సదరు వ్యక్తి సూపర్‌మార్కెట్ ఖాతాలో జమ చేయడానికి వెళ్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో డబ్బులు పట్టుబడ్డాయి. ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరుతో అధికారులు ఆ నగదును సీజ్ చేసి సదరు గుమస్తాపై కేసు నమోదు చేశారు.



ఇంట్లో మద్యం నిల్వలతో పట్టుబడ్డ కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ (ఫైల్)



కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేత అన్నల్‌దాస్ వేణు (ఫైల్)

సిరిసిల్లటౌన్/సిరిసిల్లక్రైం: ఎన్నికల కోడ్ గురించి తెలియక కొందరు.. ఎన్నిక నియమావళిపై అవగాహన లేక మరికొందరు కేసుల పాలయ్యారు. కొందరు మొహమాటానికి పోగా.. మరికొందరు తెలియక కేసుల్లో ఇరుక్కున్నారు. గత అసెంబ్లీ, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో సామన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకు పలు కేసుల్లో ఇరుక్కున్నారు.

రెండు నెలలుగా కోడ్ అమలు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈసారి ఎప్పటి మాదిరిగా కాకుండా రెండు నెలలపాటు కోడ్ అమలులో ఉంది. గత మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి రాగా.. మన రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరిగింది. సుమారు రెండు నెలలపాటు దీర్ఘకాలికంగా ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో శుభకార్యాల నిర్వాహకులు సతమతమయ్యారు. షాపింగ్ చేయడానికి, బంగారం కొనడానికి నగదు రవాణాలో ఇబ్బందులు పడ్డారు. ఇక వ్యాపారులు సైతం రోజువారి కలెక్షన్లు బ్యాంకుకు పంపించలేని దుస్థితిని ఎదుర్కొన్నారు.

భారీగా నగదు సీజ్.. కేసులు నమోదు

ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రస్తుతం వరకు జిల్లాలో గతంలో కన్నా ఎక్కువ సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. పెద్ద మొత్తంలో డబ్బు, మద్యం నిల్వలు పట్టుబడడం విశేషం. మొత్తంగా 446 మందిపై కేసుల్లో 1,078 మందిని అధికారులు బైండోవర్ చేశారు. 82 మందికి నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై 16 కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని 23 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేసినట్లు అధికారులు వివరించారు. ఇక కోడ్ అమలు నుంచి జిల్లా వ్యాప్తంగా రూ.82,11,362 నగదు, 1,664.93 లీటర్లు రూ.10,20,222 విలువైంది సీజ్ చేశారు. ఇవికాక పదహారు గంజాయి కేసుల్లో 9.2 కిలోల గంజాయిని సీజ్ చేశారు.

నమోదైన కేసుల్లో కొన్ని..

- సిరిసిల్లలో బీజేపీకి చెందిన నాయకుడు అన్నల్‌దాస్ వేణు సైలెన్స్ పీరియడ్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నేతలు కోడ్ ఉల్లంఘించారని ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు చేసిన అతను కూడా కోడ్ ప్రచారం చేయడంతో కేసు నమోదైంది.
- తంగళ్లపల్లికి చెందిన మోర దేవేందర్ మే 12వ తేదీ రాత్రి ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని స్థానికులు అధికారులకు సాక్ష్యాలతో ఫిర్యాదు చేశారు. అతని వద్ద ఓటరు లిస్టుతోపాటు రూ.400 లభించడంతో విచారణ చేపట్టిన అధికారులు కేసు నమోదు చేశారు.
- సిరిసిల్లకు చెందిన ఓ కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు ఎన్నికల రోజు ఓటర్ల వద్దకు వెళ్లి డబ్బులు ఇస్తూ.. తమ పార్టీ అభ్యర్థికి ఓటేయాలని ప్రచారం చేయగా.. దీనిపై స్థానికులు సాక్ష్యాన్ని అధికారులకు పంపించారు. దీంతో అతనిపై కేసు నమోదు చేశారు.
- సిరిసిల్లలోని 16వ వార్డుకు చెందిన కౌన్సిలర్ గుడ్ల శ్రీనివాస్ మే 12వ తేదీ రాత్రి నుంచి డబ్బు, మద్యం పంపిణీ చేస్తున్నాడని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు అధికారులు కౌన్సిలర్ ఇంట్లో సోదాలు చేయగా.. 23 ఫుల్‌బాటిళ్ల మద్యం దొరికింది. మద్యం సీజ్ చేయడంతోపాటు సదరు కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారు.

ఎస్ఎస్‌టీలను ఎత్తేశాం అంతే..



రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోనే ఉంది. మిగతా రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయి ఫలితాలు వచ్చే వరకు అంటే జూన్ 4 వరకు నిబంధనలు కొనసాగుతాయి. ఎన్నికల సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పెషల్ స్ట్రయిక్ టీమ్స్‌ను ఎత్తేశాం. ఈసీ నిబంధనలు పాటించాల్సిందే. సామన్యులు అవసరాల కోసం నగదు తీసుకెళ్లడంపై ఇబ్బందులు పడుతున్నారు. రూ.50 వేల కంటె ఎక్కువ తీసుకెళ్ల వద్దు.

– ఆనంద్‌కుమార్, ఆర్డీవో

ఎన్నికల కోడ్ అమలులో ఉంది



దేశవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. అధిక మొత్తంలో నగదు, మద్యం రవాణా చేయరాదు. వివిధ అవసరాల నిమిత్తం సామన్యులు నగదు రవాణాలో ఇబ్బందులు పడుతున్నారు. కానీ ఎన్నికల కోడ్ అమలులో ఉందని గుర్తుంచుకోవాలి. ఎన్నికల జరగాల్సి ఉన్న ప్రాంతాల్లో మాదిరిగా కాకుండా మన వద్ద కొంత ఊరట ఉంటుంది.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

క్లుప్తంగా

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేటకు చెందిన ఎండీ.ముబీన్(23) ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై నరేశ్ వివరాల ప్రకారం.. ముబీన్ భార్య కొంత కాలంగా కాపురానికి రాకపోవడంతో తల్లిదండ్రులతో ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై, మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి మజీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి


భూమయ్య (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లికి చెందిన బూరుగుల భూమయ్య(62) అనే గొర్రెల కాపరి వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. భూమయ్య మంగళవారం గొర్రెలు మేపేందుకు వెళ్లాడు. ఎండలో తిరగడంతో సాయంత్రం వాంతులు, విరేచనాలు అయ్యాయి. కుటుంబసభ్యులు స్థానికంగా చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో రాత్రి కోరుట్ల తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే చనిపోయాడు. మృతుడికి భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి వృద్ధుడు..

వీణవంక(హుజూరాబాద్): కిష్టంపేటకు చెందిన బొద్దుల బాలయ్య(98) ప్రమాదవశాత్తు బావిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. బాలయ్య బుధవారం సమీపంలోని పొలాల వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ఆయన మృతదేహం కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, మృతదేహాన్ని బయటకు తీయించారు. బాలయ్యకు మతిస్థిమితం సరిగా ఉండదని, ప్రమాదవాశాత్తు బావిలో పడి చనిపోయాడని ఆయన మనవడు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడిన రమేశ్

చందుర్తి(వేములవాడ): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని మల్యాలకు చెందిన యెల్ల రమేశ్ బుధవారం ద్విచక్రవాహనంపై చందుర్తి వెళ్తున్నాడు. మల్యాల బస్టాండ్‌లో చందుర్తి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

తోటలో పేలిన తూటా

- 'జనశక్తి' వీరన్న ఎన్‌కౌంటర్‌కు పాతికేళ్లు
- తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను చాటిన ఉద్యమనేత
- తెలంగాణవాది.. దళిత బహుజన పక్షపాతి
- హైదరాబాద్‌లో అరెస్ట్.. నర్సింగాపూర్‌లో ఎన్‌కౌంటర్

సిరిసిల్ల: బహుజన సిద్ధాంతం.. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా విప్లవ ఉద్యమాలు రూపొందించారు మారోజు వీరన్న. కులాల ప్రాతిపదికన ఉద్యమించాలని నమ్మి.. సహచరులతో విభేదించి సొంతంగా విప్లవోద్యమాన్ని నిర్మించారు. రెండున్నర దశాబ్దాల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైన ఆయనపై ప్రత్యేక కథనం.


నర్సింగాపూర్‌లో వీరన్న ఎన్‌కౌంటర్ అయిన మామిడి తోట స్థలం
మారోజు వీరన్న (ఫైల్)

ఉద్యమ నేలలో విప్లవ బీజం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట నెత్తురు పారని రోజు లేదు. సమసమాజ స్థాపన కోసం నక్సలైట్లు.. వారిని కట్టడి చేసేందుకు పోలీసులు.. ఇలా జిల్లాలో కాల్పులు.. ఎదురు కాల్పులు నిత్యకృత్యం. నేటి రాజన్నసిరిసిల్ల జిల్లాలోని పల్లెలు ఆనాడు వామపక్ష ఉద్యమాలకు పురిటిగడ్డలు. ఇక్కడ 'దున్నేవాడికే భూమి' నినాదంతో మొదలైన రైతుకూలి పోరాటం సాయుధ విప్లవోద్యమాలుగా రూపాంతరం చెందాయి. సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత మారోజు వీరన్న ఈ ప్రాంతంలో ఉద్యమాలు రూపొందించారు. 1999, మే16న బోయినపల్లి మండలం నర్సింగాపూర్ శివారులోని మామిడితోటలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వీరన్న ప్రాణాలు కోల్పోయారు.

పీడీఎస్‌యూ అగ్రనేతగా..

- మారోజు వీరన్న సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో 1962లో వడ్రంగి కుటుంబంలో జన్మించారు.
- స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య, సూర్యాపేటలో ఇంటర్మీడియెట్, సైఫాబాద్ కాలేజీలో బీఎస్సీ, ఓయూలో ఎమ్మెస్సీ చదివారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు.
- 14 ఏళ్ల ప్రాయంలో 'అన్యాయం', 'ఊరు తిరగబడింది' అనే నాటకాలు రాశారు.
- వీరన్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ సీపీఐ(ఎంఎల్) జనశక్తి పార్టీ అగ్రనేత కూర రాజన్నతో కలిసి పనిచేశారు.


తుంగతుర్తి వద్ద వీరన్న స్మారక స్తూపం

- అప్పట్లో మెడికల్, డెంటల్ కాలేజీల్లో క్యాపిటల్ ఫీజులను ప్రభుత్వం విధించడంపై పోరాడి ఆ ఫీజులను రద్దు చేయించారు.
- 1991లో మండల్ కమిషన్ ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు.
- 1994లో కరీంనగర్ జిల్లా చొప్పదండి నుంచి వీరన్న ఎమ్మెల్యేగా పోటీచేసి 22వేల ఓట్లు సాధించారు.

కూర రాజన్నతో విభేదించి..

జనశక్తి పార్టీ అగ్రనేతల్లో ఒకరుగా ఉంటూ వీరన్న కుల, వర్గ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారతదేశంలో కులాలు ఉన్నాయని, కుల ప్రాతిపదికన సంఘాలను బలోపేతం చేస్తేనే విప్లవోద్యమాలు బలపడతాయని వీరన్న సూత్రీకరించగా.. జనశక్తి అగ్రనేతలు ఈ వాదనను విభేదించారు. విప్లవ గ్రూపుల్లో కులప్రస్తావన అర్థరహితమని కొట్టిపారేశారు. దీంతో 1995లో చంద్రపుల్లారెడ్డి వర్గంలోని జనశక్తి గ్రూపు నుంచి విడిపోయి జనశక్తి వీరన్న వర్గం, జనశక్తి రాజన్న వర్గంగా(మే 17)న రెండు విప్లవ గ్రూపులు ఏర్పాటయ్యాయి. అప్పటికే ఉమ్మడి కరీంనగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు చెందిన 14 సాయుధ దళాలు వీరన్న వెంట నడిచాయి. జనశక్తి రాజన్న వెంట కేవలం 9 సాయుధ దళాలు ఉన్నాయి. ఫలితంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో వీరన్న వర్గం సాయుధ దళాలు రెండు ఏర్పాటయ్యాయి. ఈక్రమంలోనే జనశక్తి రాజన్నవర్గం, వీరన్న వర్గాల మధ్య అంతర్గత కలహాలు బయటపడ్డాయి. జిల్లాలో అప్పటికే పీపుల్స్‌వార్, జనశక్తి పార్టీలు ఉండగా.. కొత్తగా వీరన్న వర్గం ఏర్పడింది. 1999 జనవరిలో వీరన్న వర్గానికి చెందిన 11 మంది సాయుధులను గంభీరావుపేట మండలం నాగంపేట వద్ద మామిడితోటలో పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఈ సాయుధులను హైదరాబాద్ శివారులో ఓ ఇంట్లో నిర్బంధించి నాగంపేట వద్ద ఎన్‌కౌంటర్ చేసినట్లు అప్పట్లో ఆ పార్టీ ప్రకటించింది. ఈ ఎన్‌కౌంటర్‌తో జనశక్తి వీరన్న వర్గం కార్యకలాపాలు జిల్లాలో సద్దుమణిగాయి. కానీ ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలో పనిచేశాయి.

నర్సింగాపూర్ వద్ద వీరన్న ఎన్‌కౌంటర్

బోయినపల్లి మండలం నర్సింగాపూర్ మామిడి తోటలో 1999, మే 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మారోజు వీరన్న మరణించారు. ఆయనను హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌లో పట్టుకొని నర్సింగాపూర్‌కు తెచ్చి ఎన్‌కౌంటర్ చేశారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. పార్టీ కొరియర్ సిద్దేశ్వర్‌తో కలిసి వెళ్తుండగానే వీరన్నను మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని మారుతీవ్యాన్‌లో తీసుకెళ్లినట్లు వెల్లడించారు. అప్పటికే మారోజు వీరన్న రాష్ట్ర సాధన కోసం తెలంగాణ మహాసభలను ఏర్పాటు చేసి సూర్యాపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. విప్లవకారుడిగా, వక్తగా, ఆలోచనపరుడిగా అనేక వ్యాసాలు, పాటలు రాసి, పాడారు. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా ఎన్వీ కృష్ణయ్య విజయం సాధించినప్పుడు జగిత్యాలతో ఆత్మీయ సన్మానసభ నిర్వహించారు. ఈ సభలో వీరన్న జనశక్తి శ్రేణులను ఉత్సాహ పరిచేందుకు 'అందుకోర గుప్త అందుకో ఈ దొంగల తరిమేతందుకు' అంటూ.. విప్లవ గీతాలను ఆలపించి సభను ఉర్రూతలూగించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఆకాంక్షను బలంగా చాటిచెప్పారు. వీరన్న రాష్ట్ర సాధన ఉద్యమాన్ని బలంగా తీసుకెళ్తున్న క్రమంలో ఎన్‌కౌంటర్ అయ్యారు.

వీరన్న సంస్మరణ సభలు..

జిల్లాలో వీరన్న సంస్మరణ సభలను ఆయన అభిమానులు, ప్రగతిశీల వాదులు ఏటా నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభలు సమావేశాలు నిర్వహించి విప్లవ యోధుడికి నివాళి అర్పిస్తారు.

విద్యుత్ సేవల్లో పెద్దపల్లి టాప్


సుదర్శనం, ఎస్ఈ.

పెద్దపల్లిరూరల్: ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంలో మనజిల్లా అగ్రస్థానంలో నిలిచింది. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం తెలిపారు. అదేవిధంగా అధికారులు, సిబ్బంది మెరుగైన పనితీరు కనబర్చి మంచి ర్యాంక్‌లు సాధించారని అన్నారు. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లికి చెందిన ఏఈ సైపుదీన్‌కు ప్రథమ ర్యాంక్ వచ్చిందన్నారు. ఆపరేషన్, మెయింటనెన్స్‌లో ఫోర్‌మెన్ వరకు ఏఈ, సబ్‌ఇంజినీర్.. ఇలా అన్ని విభాగాల సహకారంతోనే జిల్లాకు ఈ గౌరవం దక్కిందని ఎస్ఈ పేర్కొన్నారు. మేలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నా.. ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసే సత్వరమే మంజూరు చేస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి బస్టాండ్ ప్రాంతంలో అజీజొద్దీన్‌కు చెందిన మేకల మందపై బుధవారం మధ్యాహ్నం కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 4 మేకలు చనిపోయాయి. దీనిపై ఆగ్రహించిన యజమాని అజీజొద్దీన్ చనిపోయిన జీవాలతో కొత్తపల్లి మున్సిపల్ కార్యాలయంలోకి వెళ్లి, ధర్నాకు దిగారు. తనకు సుమారు రూ.40 వేల నష్టం వాటిల్లిందన్నారు. గతంలోనూ 5 మేకలను చంపేయడంతో 9 ఫీట్ల ప్రహరీ నిర్మించానని, అయినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు హామీ ఇవ్వడంతో బాధితుడు ఆందోళన విరమించాడు. చికెన్ సెంటర్ల వ్యర్థాలను సేకరించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే కుక్కలు దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

డీజిల్ ట్యాంకర్ పడి ఒకరి దుర్మరణం

- ఏడుగురికి తీవ్ర గాయాలు
- తాడికల్ గ్రామంలో ఘటన


శ్రీనివాస్ (ఫైల్)

శంకరపట్నం(మానకొండూర్): రోడ్డు పక్కనున్నవారిపై డీజిల్ ట్యాంకర్ పడిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు బుధవారం సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీనికి హాజరైన సీనియర్ ఖోఖో ప్లేయర్ పూదరి శ్రీనివాస్, సాగంటి ప్రకాశ్ నీళ్లు తాగేందుకు వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్తున్నారు. అదే సమయంలో హుజూరాబాద్ వైపు నుంచి అంబాల్‌పూర్ వెళ్లాల్సిన జాతీయ రహదారి నిర్మాణ సంస్థ డీబీఎల్‌కు చెందిన డీజిల్ ట్యాంకర్ రావడంతో రోడ్డు దిగి, పక్కన నిల్చున్నారు. కరీంనగర్ ఆస్పత్రికి, ఇతర పనుల కోసం వెళ్లడానికి ఆర్టీసీ బస్సు కోసం తాడికల్‌కు చెందిన వంగల కనకమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, చింతగుట్టకు చెందిన ఆడెపు లాస్య, ఆడెపు మౌనిక, మంద రాజమ్మ అక్కడే చెట్టు కింద కూర్చున్నారు. డీజిల్ ట్యాంకర్ అక్కడికి చేరుకోగానే పక్కకు ఒరిగి, వారిపై పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ ట్యాంకర్ కింద నలిగి, మృతిచెందాడు. మిగతా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

అంతకుముందు మరొకరిని ఢీకొన్న ట్యాంకర్

డీజిల్ ట్యాంకర్ ఈ ప్రమాదానికి ముందు వంకాయలగూడెం వద్ద అదే గ్రామానికి చెందిన జడల రాజయ్యను ఢీకొట్టడంతో అతను గాయపడ్డాడు. గ్రామస్తులు పట్టుకుంటారేమోనన్న భయంతో డ్రైవర్ ట్యాంకర్‌ను ఆపకుండా వెళ్లిపోయాడు. ఆ హడావుడిలోనే తాడికల్ గ్రామంలో స్పీడ్ బ్రేకర్ వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ట్యాంకర్ గ్రామస్తులపై బోల్తా పడింది.


ట్యాంకర్‌ను క్రేన్ సహాయంతో పక్కకు తీయిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ జాం..

సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఎస్సైలు లక్ష్మారెడ్డి, ఆరోగ్యం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ట్యాంకర్ నుంచి డీజిల్ కారడంతో రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ జాం అయింది. పోలీసులు క్రేన్ సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు జరిపించారు. ఆ సమయంలో ట్యాంకర్ నుంచి డీజిల్ ఎక్కువగా కారడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని తెప్పించి, చల్లించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రహదారి సంస్థకు చెందిన సూపర్‌వైజర్‌పై గ్రామస్తులు చేయిచేసుకున్నారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ డ్రైవర్‌ను గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రోదిస్తున్న మృతుడి కుమారుడు, కూతురు, సోదరుడు

కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రికి 25 ఏళ్ల జైలు

జగిత్యాల జోన్: కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో ఓ కసాయి తండ్రికి 25 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ జగిత్యాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ బుధవారం తీర్పు చెప్పారు. అంతేకాకుండా, బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్ కథనం ప్రకారం.. కోరుట్ల మండలం ఎఖీన్‌పూర్‌కు చెందిన ఎల్లాల తుకారాం వ్యవసాయం చేసేవాడు. భార్యను కత్తితో పొడిచి, చంపాడు. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు. తర్వాత కొడుకు తండ్రితో తెగదెంపులు చేసుకొని, నానమ్మ వద్ద ఉంటున్నాడు. అనంతరం తుకారం రెండో పెళ్లి చేసుకున్నాడు. అతని వేధింపులు భరించలేక ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. తర్వాత, మూడో పెళ్లి చేసుకోగా ఒక కూతురు జన్మించింది. అయితే, అక్టోబర్ 14, 2022న రాత్రి తూకారాం తన భార్య, 12 ఏళ్ల కూతురితో కలిసి భోజనం చేసి, నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బిడ్డ కేకలు విని నిద్ర లేచిన తల్లికి జరిగిన సంఘటనను వివరించింది. దీంతో ఆగ్రహించిన ఆమె భర్తను కోప్పడగా, విషయం ఎక్కడైనా చెబితే ఇద్దరినీ పెట్రోల్ పోసి, చంపుతానని బెదిరించాడు. రెండు రోజులకు వారు తుకారం మొదటి భార్య కొడుకు మహేశ్‌కు చెప్పారు. అతని సహాయంతో కోరుట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై సతీశ్ కేసు నమోదు చేయగా, సీఐ రాజశేఖర్ రాజు దర్యాప్తు చేపట్టారు. తూకారాంను అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ సిబ్బంది కోర్టులో బలమైన సాక్ష్యాలను ప్రవేశపెట్టడంతో నేరం రుజువైంది. దీంతో తుకారాంకు న్యాయమూర్తి జైలుశిక్ష, జరిమానా విధించారు.

హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు

మేడిపల్లి(జగిత్యాల): హత్య కేసులో నేరస్తుడికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ జగిత్యాల న్యాయస్థానం తీర్పు వెలువరించిందని ఎస్సై శ్యాంరాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఓరుగంటి రాజు, పూదరి లక్ష్మణ్.. ఇద్దరిదీ భీమారం మండల కేంద్రం. నాలుగేళ్ల క్రితం పెళ్లి బరాత్‌లో గొడవ పడ్డారు. రాజు క్షణికావేశంలో లక్ష్మణ్‌ను కత్తితో పొడిచి, హత్య చేశాడు. మృతుడి అన్న సతీశ్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా సీఐ రాజశేఖర్ విచారణ చేపట్టి, కోర్టులో చార్జిషీట్ వేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి బుధవారం రాజుకు జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

గుంజపడుగులో ప్రహరీ వివాదం

- ఇరు కుటుంబాల మధ్య గొడవ
- ఇల్లు ధ్వంసం, ఇద్దరికి తీవ్ర గాయాలు
- ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు

గొల్లపల్లి(ధర్మపురి): ప్రహరీ విషయంలో రెండు కుటుంబాల మధ్య గొడవ ఉద్రిక్తతకు దారితీసింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలవగా, ఒకరి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. ఎస్సై సతీశ్‌కుమార్ వివరాల ప్రకారం.. గొల్లపల్లి మండలంలోని గుంజపడుగుకు చెందిన కళ్లెం తిరుపతి, పస్తం శారద ఇళ్ల మధ్య ప్రహరీ ఉంది. దీని గురించి కొంతకాలంగా ఇరుకుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గతంలో కేసులు కూడా నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం మాటామాట పెరిగి, తిరుపతి శారద ఇంటిపై దాడి చేసి, ఆమెను దూషించాడు. దీంతో ఆమె కుటుంబసభ్యులు సైతం గొడవకు దిగారు. ఇరుకుటుంబాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లారు. స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సంఘటనలో తిరుపతి ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. విషయం పోలీసులకు తెలియడంతో సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై సతీశ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అప్పటికే శారద సోదరులు సమ్మయ్య, పోచయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేశ్, శ్రీకాంత్‌తోపాటు మరో 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


ధ్వంసమైన ఇల్లు


గ్రామంలో పోలీస్ పికెట్

వికటించిన మహిళా ఆర్‌ఎంపీ వైద్యం

- చావుబతుకుల మధ్య వృద్ధురాలు
- ఎక్కువ రోజులు బతకదన్న వైద్యులు
- ఇంటికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు

మానకొండూర్ రూరల్: మహిళా ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి, ఓ వృద్ధురాలు చావుబతుకుల మధ్య ఉంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత కుటుంబసభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం.. లింగాపూర్ గ్రామంలోని రాంనగర్ బేడబుడిగ జంగాల కాలనీకి చెందిన భూపతి కనకవ్వకు ఈ నెల 2న జ్వరం వచ్చింది. దీంతో ఆమె కుటుంబసభ్యులు వైద్యం కోసం స్థానిక ఆర్‌ఎంపీ మమతను ఇంటికి పిలిపించారు. కనకవ్వను పరీక్షించిన ఆమె, గ్లూకోజ్ పెట్టి, అందులో ఇంజెక్షన్ కలిపి వెళ్లిపోయింది. 30 నిమిషాల తర్వాత ఆ వృద్ధురాలి శరీరంపై దద్దుర్లు, బొబ్బలు రావడంతో ఆర్‌ఎంపీకి సమాచారం ఇచ్చారు. ఆమె మళ్లీ వచ్చి, ఇంకో ఇంజెక్షన్ వేసి, వెళ్లిపోయింది. 20 నిమిషాల తర్వాత కనకవ్వ నాలుక లావై, కాళ్లుచేతులు చచ్చుబడిపోయాయి. వెంటనే కుటుంబసభ్యులు 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి, 6 రోజులు చికిత్స చేయించారు. అక్కడినుంచి మరో దవాఖానాలో చేర్పించారు. కనకవ్వ ఎక్కువ రోజులు బతకదని వైద్యులు నిర్ధారించడంతో మంగళవారం రాత్రి ఇంటికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆమె చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. బాధితురాలి కుమారుడు రమేశ్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.


వారం క్రితం చికిత్స పొందుతున్న కనకవ్వ

జేవీ చలపతిరావుకు మాతృవియోగం


సూరమ్మ (ఫైల్)

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రెడ్ జేవీ చలపతిరావు తల్లి సూరమ్మ(90) బుధవారం హైదరాబాద్‌లోని అల్వాల్‌లో మరణించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన జువ్వాడి సూరమ్మ, మురళీమనోహర్‌రావు దంపతుల కొడుకు చలపతిరావు. ఆయన విద్యార్థి దశలోనే ఉద్యమాల వైపు సాగాడు. సీపీఐ(ఎంఎల్) జనశక్తి ఉద్యమంలో కీలక నాయకుడిగా ఎదిగారు. మూడు దశాబ్దాలపాటు అజ్ఞాత జీవితం గడిపారు. 1994లో అజ్ఞాతవాసం వీడి, సిరిసిల్ల ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆయన తల్లి సూరమ్మ సిరిసిల్ల ప్రాంతంలో కరుడుగట్టిన భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో ముందునిలిచారు. సూరమ్మ హైదరాబాద్‌లోని తన చిన్న కుమారుడి ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు గురువారం ఉదయం అల్వాల్ శ్మశానవాటికలో నిర్వహించనున్నారు. సూరమ్మ మృతిపై రాజన్నసిరిసిల్ల జిల్లా సీపీఐ కార్యదర్శి గుంటి వేణు సంతాపం ప్రకటించారు.

ఆమె నేత్రాలు సజీవం


అహల్యమ్మ (ఫైల్)

కమాన్‌పూర్(మంథని): మండలంలోని జూలపల్లికి చెందిన పెరటి అహల్యమ్మ అనే వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబసభ్యులు ముందుకురాగా, సదాశయ ఫౌండేషన్, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ సేకరించారు. ఈ సందర్భంగా అహల్యమ్మ కుటుంబసభ్యులను ఫౌండేషన్ జాతీయ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శ్రవణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, మహిళా అధ్యక్షురాలు కవిత, క్లబ్ కార్యదర్శి శంకర్ అభినందించారు.

తాగి కొట్టుకున్న యువకులు

- ఒకరికి తీవ్ర గాయాలు
- విచారణ చేపట్టిన పోలీసులు

చందుర్తి(వేములవాడ): స్నేహితులతో కలిసి దావత్ చేసుకుంటుండగా తలెత్తిన వివాదం చివరికి దాడి చేసుకునే వరకు దారితీసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ చందుర్తి మండలం తిమ్మాపూర్‌కు చెందిన అఖిల్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. తిమ్మాపూర్‌లో బుధవారం పోచమ్మబోనాల ఉత్సవాలు నిర్వహించారు. సాయంత్రం వేళ తిమ్మాపూర్‌కు చెందిన పది మంది యువకులు, ఆశిరెడ్డిపల్లెకు నలుగురు యువకులు కలిసి రాత్రి పొద్దుపోయే వరకు విందు చేసుకున్నారు. ఈక్రమంలోనే రెండు వర్గాలుగా విడిపోయారు. వారి మధ్య మాట..మాట పెరిగి పరస్పరం దాడి చేసుకున్నారు. గొడవ జరుగుతుండగానే అక్కడ ఉన్న 14 మంది యువకుల్లో 9 మంది అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడే ఉన్న తిమ్మాపూర్‌కు చెందిన అఖిల్‌ను ఆశిరెడ్డిపల్లెకు చెందిన నలుగురు తీవ్రంగా చితకబాదారు. ఈ దాడిలో అఖిల్ తలకు బలమైన గాయం కావడంతో పోలీసులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ఈ దాడి ఘటన గురించి తెలుసుకొని చందుర్తి ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విందు చేసుకున్న సమయంలో వీరంతా కలిసి గంజాయి సేవించారన్న ప్రచారం జరగడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.


బాధితుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న ఎస్సై